# తప్పుడు కేసులు పెడితే తిప్పలే!

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, ప్రజా సమస్యలపై గళం విప్పడం, ప్రభుత్వ, అధికార యంత్రాంగ వేధింపులకు గురవుతున్న బాధితుల పక్షాన నిలబడిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని కేసులతో వేధింపులకు దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో కృత్రిమంగా ఫిర్యాదులను సృష్టించి మరీ కేసులు పెట్టడం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలో హైకోర్టు పలుమార్లు సంబంధిత పోలీసు అధికారులకు మొట్టికాయలు వేసినా వారు తమ తీరును మార్చుకోవడం లేదు. వాస్తవానికి పోలీసులు తాము ఎఫ్ఐఆర్ నమోదు చేసే సమయంలోనే ఫిర్యాదుదారుడు ఇచ్చే సమాచారం పూర్తిగా నిజమైనదని, అందుకు సంబంధించి ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే దానిపై పూర్తి స్పష్టతతో ఉండాలి. ఆ మేరకు న్యాయస్థానాల్లోనూ వాటిని రుజువు చేయాల్సి ఉంటుంది. కానీ, గత ఏడాదిన్నరలో అనేక సందర్భాల్లో న్యాయస్థానాలు పోలీసుల తీరును తప్పుబట్టడంతోపాటు కేసులను క్వాష్ చేయడం... చివరకు ఉద్దేశపూర్వకంగా పోలీసులు కోర్టు మెట్లు ఎక్కించిన తర్వాత రిమాండ్‌ను తిరస్కరించిన దాఖలాలూ ఉన్నాయి.

### అరెస్టులు వద్దన్న ధర్మాసనం...

- ఏడేండ్లలోపు శిక్ష పడే కేసుల్లో అరెస్టులు వద్దని, కేవలం 41 సీఆర్‌పీసీ (బీఎన్ఎస్ 35(1)) కింద నోటీసులు ఇవ్వాలని న్యాయస్థానాలు పలు కేసుల సందర్భాల్లో తీర్పులు వెలువరించాయి.
- అర్నేశ్‌కుమార్ వర్సెస్ బీహార్ ప్రభుత్వం, ఎండీ అస్ఫాక్ ఆలం వర్సెస్ ఝార్ఖండ్ ప్రభుత్వం–ఇతరులు కేసులో ఏడేండ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో 41 సీఆర్‌పీసీ (బీఎన్ఎస్ 35(1)) కింద నోటీసులు మాత్రమే ఇవ్వాలని, అరెస్టు చేయొద్దనే స్పష్టమైన తీర్పులు వచ్చాయి. నోటీసులు ఇవ్వడంపై మార్గదర్శకాలను సైతం న్యాయస్థానం సూచించింది.
- ప్రధానంగా 31.07.2023 తేదీన అస్ఫాక్ ఆలం వర్సెస్ ది స్టేట్ ఆఫ్ ఝార్ఖండ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. 'పోలీసులు ఏ వ్యక్తినైనా అరెస్టు చేయడం వల్ల ఆ వ్యక్తికి అవమానం జరగడంతోపాటు అతని వ్యక్తిగత ప్రతిష్ఠ, ఆత్మగౌరవం దెబ్బతింటుంది. ఇది పోలీసుల విపరీతమైన చర్యగా పరిగణించబడటంతోపాటు వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్లవుతుంది' అని పేర్కొంది. ఈ తరహా చర్య భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌లో పొందుపరిచిన నిబంధనల్ని ఉల్లంఘించినట్లవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే పోలీసులు 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీచేయడంపై మార్గదర్శకాలను వెలువరించింది. అనవసరమైన అరెస్టులను నివారించడంతోపాటు అరెస్టు బెదిరింపులు లేకుండా చేయడమే ఈ తీర్పు ప్రధాన ఉద్దేశమని దేశ అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.



## పోలీస్ మిత్రులారా.. మీరెందుకు దుంకులాడుతున్నరు?

"ప్రజాస్వామ్యంలో ప్రజలకు అడిగే హక్కు ఉంది. తప్పకుండా అడుగుతరు. ఇంత అన్యాయం జరుగుతుంటే చూడలేక బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ ప్రజలకు మద్దతుగా నిలబడుతున్నరు. ఇదేం అన్యాయమని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నరు. అలాంటి వాళ్లపై కేసులు పెడుతున్నరు. వాళ్లను పట్టుకుపోతున్నరు. పోలీసు సోదరులను అడుగుతున్న.. మీరెందుకు దుంకులాడుతున్నరు? మీకు ఏం అక్కరొచ్చింది? పోలీస్ మిత్రులారా.. ఈ రోజు రాత్రి మీ ఇండ్లకు వెళ్లి మీ డైరీల్లో రాసి పెట్టుకోండి... మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ గవర్నమెంటే. బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్లు, కార్యకర్తలకు ఒక్కటే చెప్తున్న... ఎక్కడైనా, ఎవరైనా మీపై అన్యాయంగా కేసులు పెడితే మన బీఆర్ఎస్ లీగల్ సెల్ వీరులున్నరు. మీరు భయపడాల్సిన అవసరం లేదు. మీకు అండగా కేసీఆర్ ఉంటడు. బీఆర్ఎస్ ఉంటది.

**- వరంగల్ రజతోత్సవ సభలో పోలీసుల తీరుపై కేసీఆర్**

### వదిలిపెట్టే ప్రసక్తే లేదు

"తెలంగాణ పోలీసుల్లో కొంతమంది రేవంత్ రెడ్డి ప్రైవేటు సైన్యంలాగా పని చేస్తున్నరు. ఆ కొంతమందికి కూడా ఇదే హెచ్చరిక.. అలా పనిచేస్తున్న పోలీసులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. మీ మీద కూడా సుప్రీంకోర్టుకు వెళ్తాం. ఇష్టానుసారంగా అడ్డమైన కేసులు పెడుతున్న పోలీసు అధికారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

- అదే అంశంపై రాష్ట్ర హైకోర్టు సర్క్యులర్ నెం.12/ఎస్‌వో/2023, రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి సర్క్యులర్ నం.3340/సీ13/ఎస్‌సీఆర్‌బీ/సీఐడీ–టీ/2023 వేర్వేరుగా ఇస్తూ 41 సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇచ్చేందుకు మార్గదర్శకాలను అన్ని పోలీస్ స్టేషన్లకు పంపింది. అంశం తీవ్రతను గుర్తించేందుకుగాను ఇందులోనే అస్ఫాక్ ఆలం వర్సెస్ ది స్టేట్ ఆఫ్ ఝార్ఖండ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోని పలు కీలక అంశాలను కూడా పొందుపరిచారు.

### అయినా న్యాయస్థానాల తీర్పులూ బేఖాతరే...

సుప్రీంకోర్టు, హైకోర్టుతోపాటు డీజీపీ ఆదేశాలను కూడా కొందరు పోలీసు అధికారులు తుంగలో తొక్కుతున్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో 04-12-2024 తేదీన క్రైమ్ నం.1127 2024 కేసులో 57, 126(2), 127, 127(2), 132, 224, 333, 351(1), 191(2), రెడ్ విత్ 190 రెడ్ విత్ 3(5) ఆఫ్ బీఎన్ఎస్ 2023 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ సెక్షన్ల కింద ఒకవేళ నేరం రుజువైనా ఏడేండ్ల కంటే తక్కువ కాలమే శిక్ష పడుతుంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానాల గత తీర్పులు, డీజీపీ సర్క్యులర్ ప్రకారం అరెస్టు చేయకూడదు. కానీ, పోలీసు అధికారులు కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేశారు.

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఇంటర్నెట్ కాల్ ద్వారా బెదిరించారంటూ చేసిన ఫిర్యాదుపై అరెస్టయిన అఖిలేశ్‌రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అఖిలేశ్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేసు కొట్టివేతకు నిరాకరించిన హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి బెయిల్ మంజూరు చేసింది. ఏడేండ్లలోపు శిక్ష పడే కేసుల్లో బీఎన్ఎస్ఎస్ 35(సీఆర్‌పీసీ 41ఏ) ప్రొసీజర్‌ను పరిశీలించకుండా యాంత్రికంగా నిందితుడిని రిమాండ్ పంపిన కరీంనగర్ మొదటి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌తోపాటు దర్యాప్తు అధికారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఇచ్చిన వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడాలన్న ఉద్దేశంతో అర్ణబ్ గోస్వామి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి నిందితుడికి బెయిల్ ఇస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది. ప్రొసీజర్‌ను అనుసరించని దర్యాప్తు అధికారిపై, యాంత్రికంగా జైలుకు పంపిన మేజిస్ట్రేట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

### బాసటగా నిలుస్తున్న బీఆర్ఎస్ లీగల్ సెల్...

రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాదిన్నరగా అధికార పార్టీ ఒత్తిళ్లతో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న కొందరు పోలీసు అధికారులపై బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించింది. అనేక కేసుల్లో తప్పుడు సెక్షన్లు, ఏడేండ్లలోపు శిక్ష పడే కేసుల్లోనూ అరెస్టులు చేయడం తదితర అంశాలన్నింటిపై దృష్టిసారించింది. పోలీసులు చట్టానికి అతీతులుకారని రుజువు చేసేందుకు నడుం బిగించింది. రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించేందుకు 'కొందరు పోలీసు అధికారుల'పైనే రివర్స్ కేసులు నమోదు చేయాలనే న్యాయమైన డిమాండును భుజానికి ఎత్తుకుంది. ఫిర్యాదుదారుతో పోలీసులు కలిసిపోయి ఎదుటివారిపై తప్పుడు కేసులు బనాయిస్తే సెక్షన్లు 198, 199, 248 ఆఫ్ ద బీఎన్ఎస్ 2023 కింద విచారణ జరపడంతోపాటు రూ.రెండు లక్షల వరకు జరిమానా, జైలుశిక్ష కూడా పడే అవకాశముంది. ఇప్పటి వరకు దాదాపు 30 కేసుల్లో కొందరు పోలీసు అధికారుల అత్యుత్సాహాన్ని ఎత్తిచూపుతూ ఆయా కేసుల్లో సంబంధిత విచారణ అధికారి నుంచి ఏసీపీ, డీసీపీ, సీపీ, డీజీపీ వరకు నోటీసులు జారీచేసింది. లగచర్ల ఘటనలో అమాయక గిరిజనులపై నమోదైన కేసుల్లోనూ బాధిత గిరిజనుల తరపున న్యాయపరంగా బాసటనిచ్చింది. పలు కేసుల్లో లీగల్ సెల్ సమర్పించిన డాక్యుమెంట్లు, వాదనలతో కోర్టు సంతృప్తి చెంది కేసులను క్వాష్ చేసిన సందర్భాలు ఉన్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఘటనలో విద్యార్థులపై పెట్టిన కేసుల విషయంలో లీగల్ సెల్ తనవంతుగా న్యాయసహాయం అందించింది. బీఆర్ఎస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు అక్రమమైనవని నిరూపించేందుకు ఆయా కేసుల్లో అవసరమైన న్యాయపరమైన అంశాలతో కూడిన మెటీరియల్ సిద్ధం చేసుకొని న్యాయస్థానాల తలుపు తట్టింది.

### ప్రభుత్వ పెద్దలకు నచ్చకపోతే నేరమా?

భారత రాజ్యాంగం కల్పించిన హక్కును తెలంగాణలో కొందరు పోలీసులు కాలరాస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరో పంపిన పోస్టు నచ్చి రీట్వీట్ చేసినా దానిని నేరంగా పరిగణించి వేధింపులకు గురిచేస్తుండటం ఆందోళనకు గురిచేస్తున్నది. ముఖ్యంగా ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతలకు నచ్చని పోస్టును రీట్వీట్ చేసిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల్ని రాజకీయ కక్షతో కేసులు నమోదు చేసి ముప్పుతిప్పలు పెడుతున్నారు. కొణతం దిలీప్, మన్నె క్రిశాంక్, గౌతమ్ తదితరులపై కేవలం ఒక పోస్టును రీట్వీట్ చేసినందుకు ఐటీ చట్టం కింద నమోదు చేసిన కేసులు హాస్యాస్పదంగా ఉన్నాయని బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు స్పష్టం చేస్తున్నారు. సదరు పోస్టుల్లో ఉద్దేశించిన వ్యక్తి, సంస్థ కాకుండా ఎవరో సంబంధం లేని వ్యక్తులు ఫిర్యాదు చేసినా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ శ్రేణుల్ని వేధింపులకు గురిచేస్తున్నట్లు చెప్పారు.

### పలు కేసుల్లో తీర్పులు...

**ఇప్పటికే పలు కేసుల్లో లీగల్ సెల్ న్యాయస్థానాలను ఆశ్రయించిన సందర్భాల్లో సంతృప్తికరమైన తీర్పులు కూడా వచ్చాయి.**

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయన సోషల్ మీడియాలో చేసిన పోస్టులను ఉటంకిస్తూ పెట్టిన కేసుపై లీగల్ సెల్ కోర్టును ఆశ్రయించింది. దీంతో కేసు ఏకంగా కక్షపూరితంగా పెట్టినదేనని, పోలీసులు పెట్టిన సెక్షన్లు ఏవీ కూడా ఆయనపై చేస్తున్న ఆరోపణలకు వర్తించవంటూ కోర్టు ఆ కేసును క్వాష్ చేసింది.
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై పంజాగుట్ట పీఎస్‌లో పెట్టిన కేసులోనూ.. ఆ కేసు సరైనది కాదని, ఉద్దేశపూర్వకంగా కేసు పెట్టడమే కాకుండా కంటెంట్ కరెక్ట్‌గా లేదని పోలీసులను చీవాట్లు పెట్టి, కేసును హైకోర్టు క్వాష్ చేసింది.
- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేసులోనూ లీగల్ సెల్ సమర్థంగా వాదనలు వినిపించడంతో పోలీసుల తీరుపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అక్రమంగా ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించింది. సంబంధిత కేసులో నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేండ్లలోపు శిక్ష పడేవే అయినందున స్టేషన్ బెయిల్ ఎందుకు ఇవ్వలేదని కోర్టు ప్రాసిక్యూషన్‌ను అడిగింది.
- మహిళా జర్నలిస్టులు విజయారెడ్డి, రేవతి కేసుల్లోనూ పోలీసులు పెట్టిన సెక్షన్లు కూడా ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న కంటెంట్‌కు ఏ మాత్రం సంబంధం లేవని కోర్టు దృష్టికి లీగల్ సెల్ తీసుకువెళ్లింది.

### అసలు చట్టం ఏం చెబుతుంది?

**సామాజిక** మాధ్యమాలకు సంబంధించి పోలీసులు నమోదు చేస్తున్న కేసుల్లో పొందుపరుస్తున్న చట్టాలను పరిశీలిస్తే... సమాచార సాంకేతిక చట్టం, 2000లోని 67, 67ఎ సెక్షన్లు చెబుతున్నది వేరైతే పోలీసులు ఆయా కేసుల్లో దానిని అమలు చేస్తున్నది ఇంకోటి. ఈ సెక్షన్ల కింద ఎలక్ట్రానిక్ రూపంలో అశ్లీల ప్రచురణ గాని, ప్రసారం చేయడం గాని లేదా లైంగికంగా అసభ్యకరమైన విషయాలను సూచించేలా ఉండటం నేరం. ఇదే విషయాన్ని అపూర్వ అరోరా, ఇతరులు వర్సెస్ స్టేట్ (ఢిల్లీ) కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. ఐటీ సెక్షన్– 67 ప్రకారం అశ్లీల విషయాలను ప్రచురించడం లేదా ప్రసారం చేయడంతోపాటు చట్టం చెబుతున్నట్లు సదరు కంటెంట్‌తో వ్యక్తులు వ్యవస్థను దుర్వినియోగం చేసేలా ఉంటేనే ఈ చట్టం వర్తిస్తుంది.

## లోకం పోకడ




ఇక మనకు రోజంతా ఈ ఫోన్‌లో మాట్లాడుకునే ఖర్మేం పట్టింది వదిన? సరిహద్దులకు వచ్చేస్తే ఎంచక్కా కలిసి మాట్లాడుకోవచ్చు

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 40.6°c | 25.8°c |
| రంగారెడ్డి | 38.7°c | 21.8°c |
| ఖమ్మం | 38.0°c | 26.0°c |
| నిజామాబాద్ | 37.5°c | 26.2°c |
| నల్లగొండ | 37.5°c | 26.2°c |
| మెదక్ | 37.1°c | 25.3°c |
| కరీంనగర్ | 37.0°c | 28.0°c |
| వరంగల్ | 36.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 35.2°c | 26.7°c |
| మహబూబ్‌నగర్ | 35.0°c | 25.0°c |

## ఉద్యోగులను అవమానిస్తరా?

మొదటిపేజీ తరువాయి...

కాదు, తెలంగాణ ప్రజల జీవితాలు ముఖ్యమనే నినాదంతో కొట్లాడామని తెలిపారు. పది వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు తక్షణమే బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 5 డీఏలు ఇవ్వాలని, పీఆర్సీ అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం అన్ని పార్టీలకు చెందిన ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి తెలంగాణ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ (టీఈసీసీ)గా ఏర్పడినట్టు వెల్లడించారు. జూన్ 2 వరకు ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి ఐక్య కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేశామని, చాలా ప్రయోజనాలు సాకారం చేశామని వెల్లడించారు. జీతాల పెంపు, పదోన్నతుల వంటి అనేక విధాలుగా గత ప్రభుత్వం ఉద్యోగులకు అండగా నిలిచిందని వివరించారు.

**ఐదు డీఏలు జరూర్ దేనా: స్వామిగౌడ్**

పర్యాటకులు తెలంగాణకు జరూర్ ఆనా అంటూ ప్రభుత్వం ఎలా చెప్తున్నదో అలాగే తాము పాంచ్ డీఏ జరూర్ దేనా అని డిమాండ్ చేస్తున్నట్టు శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ తెలిపారు. పీఆర్సీ గడువు దాటిందని, వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు జేఏసీగా ఏర్పడి ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని, వారికి మద్దతుగా తాము కూడా పోరాడుతున్నట్టు పేర్కొన్నారు. 3.50 లక్షల మంది పెన్షనర్స్, రిటైర్డ్ అయినవారు 10 వేల మంది ఉన్నారని చెప్పారు.

**కాలయాపన కోసమే కమిటీలు: దేవీప్రసాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మండిపడ్డారు. ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయపాన చేస్తున్నదని విమర్శించారు. సకలజనుల సమ్మెలో వీరోచిత పోరాటం చేసిన ఉద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి అవమానించడం సరికాదని హితవు పలికారు. 57 సమస్యల్లో 45 పరిష్కరించినట్టు ప్రభుత్వం చెప్తున్నదని, ఆ జీవోలు ఎక్కడున్నాయని బయటపెట్టాలని సవాల్ విసిరారు. గతంలో పెన్షనర్లను గోసపెట్టిన చంద్రబాబును గద్దె దించామని గుర్తుచేశారు.

**చంద్రబాబులా రేవంత్ వైఖరి: విఠల్**

సీఎం రేవంత్‌రెడ్డి రూ.3.5 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఇందులో ఉద్యోగులకు ఖర్చయ్యేది నెలకు రూ.6 వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. పరిపాలన వ్యయమంతా ఉద్యోగుల జీతాలకే సరిపోతున్నదంటూ దుష్ప్రచారం చేయడం తగదని చెప్పారు. గతంలో చంద్రబాబు కూడా ఇలాగే ప్రచారం చేసి అభాసుపాలయ్యారని గుర్తుచేశారు.

**కమిటీ ఎవరికీ పోటీ కాదు: పాతూరి సుధాకర్‌రెడ్డి**

సమన్వయ కమిటీ ఏ ఇతర సంఘానికి కూడా పోటీ కాదని మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఇది కేవలం సమన్వయ కమిటీ మాత్రమేనని పేర్కొన్నారు. సీఎం మాట్లాడిన తర్వాత ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. తెలంగాణ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న రెగ్యులర్ టీచర్లకు జీతం ఇంకా రాలేదని చెప్పారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వ కమిటీ ఎవరిని సంప్రదిస్తుందో అర్థం కావడంలేదని విమర్శించారు. సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు భుజంగరావు, హమీద్, మోహన్, శ్యామ్, నారాయణ్‌రెడ్డి, హసన్, బాలమురళి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## జాన్సన్ నాయక్‌పై కక్ష సాధింపు

**ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**




ఉట్నూర్, మే 19 : బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్‌పై ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. 2023లో ఉట్నూర్ నుంచి ఖానాపూర్‌కు వెళ్తున్న క్రమంలో కొత్తగూడ చెక్‌పోస్ట్ వద్ద కాంగ్రెస్ నాయకులు జాన్సన్‌నాయక్‌ను అడ్డగించే ప్రయత్నం చేసి హంగామా సృష్టించారని గుర్తుచేశారు. అప్పటి విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు కేసు నమోదు చేయించగా సోమవారం పోలీసులు నోటీసులు అందించారని తెలిపారు. తాము కేసులకు భయపడేదిలేదని చెప్పారు. అధికార పార్టీ కావాలనే జాన్సన్ నాయక్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు.

## రైల్వే సేవలన్నీ ఒకే చోట!

**'స్వరైల్' యాప్‌ను తెచ్చిన ఐఆర్‌సీటీసీ**

**టికెట్ బుకింగ్, ట్రైన్ ట్రాకింగ్, ఫుడ్ ఆర్డర్ తదితర సేవలన్నింటికీ ఇకపై ఒకే యాప్**



న్యూఢిల్లీ, మే 19: రైల్వే సేవలన్నింటినీ ఒకే డిజిటల్ వేదిక ద్వారా అందించేందుకు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) 'స్వరైల్' పేరుతో సరికొత్త మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (సీఆర్ఐఎస్) అభివృద్ధి చేసిన ఈ యాప్‌ను 'సూపర్ యాప్'గా పేర్కొంటున్నారు. రైల్వే శాఖ అందిస్తున్న దాదాపు అన్ని రకాల సేవలను ఒకే ఛత్రం కిందికి తెచ్చి ఈ యాప్‌ను రూపొందించారు.

- ఇప్పటివరకు అందుబాటులో ఉన్న 'రైల్ కనెక్ట్' యాప్‌తో పోలిస్తే 'స్వరైల్' ఎన్నో ఆధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్నది.
- ప్రస్తుతం ఆండ్రాయిడ్ ఫోన్ల వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
- ప్రయాణికులు పొడవైన క్యూలలో నిలబడాల్సిన అవసరం లేకుండా రిజర్వ్‌డ్, అన్ రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫామ్ టికెట్లను సులభంగా పొందేందుకు ఈ యాప్ వీలుకల్పిస్తుంది.
- అందుబాటులో ఉన్న రైళ్ల వివరాలతోపాటు లైవ్ ట్రైన్ ట్రాకింగ్, ఫుడ్ ఆర్డర్ తదితర సేవలను సైతం 'స్వరైల్' యాప్ ద్వారా పొందవచ్చు.
- వినియోగదారులు పాత ఐఆర్‌సీటీసీ 'రైల్ కనెక్ట్' ఖాతా వివరాలతో 'స్వరైల్' యాప్‌లోకి లాగిన్ కావాల్సి ఉంటుంది.
- 'రైల్ కనెక్ట్'లో ఖాతా లేనివారు 'స్వరైల్'లో కొత్త ఖాతాను సృష్టించుకోవచ్చు.

# రేవంత్ సారూ.. రైతు భరోసా ఏదీ?

- సీజన్ ముగిసినా రాని యాసంగి సాయం
- కాంగ్రెస్ సర్కారు పెట్టిన గడువు మార్చి 31
- యాభై రోజులైనా మాటనిలుపుకోని సీఎం
- రైతులకు ఇంకా రూ.4,120 కోట్లు బాకీ
- చెల్లింపుల కోసం పైసా విదల్చని సర్కారు
- 15 రోజుల్లో వానకాలం సీజన్ ఆరంభం
- ఇప్పటికే గత వానకాలంలో ఎగనామం
- రైతుభరోసా కింద రైతులకు మొత్తంగా రూ.21,800 కోట్లు బాకీ పడ్డ సర్కారు



### 15 వేలన్నారు... రూ.12వేలతో సరిపెట్టారు

**'ఇప్పుడు తీసుకుంటే** ముష్టి రూ.ఐదువేలే. అదే కాంగ్రెస్ సర్కారు వచ్చినంక రూ.15 వేలు వస్తయి' ఇవీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతుభరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి పలికిన ప్రగల్బాలు. రైతుబంధు కింద కేసీఆర్ సర్కారు ఇస్తున్న ఎకరానికి రూ.10 వేలను రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక ఒక విడతలో రూ.ఐదు వేలే ఇచ్చింది. మరో విడతలో పూర్తిగా ఎగనామం పెట్టింది. ఈ యాసంగి సీజన్‌లో తాము హామీ ఇచ్చినవిధంగా రూ.15వేలు కాకుండా ఎకరాకు రూ.12వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించింది. యాసంగి సీజన్ ముగిసినా ఆ మాట కూడా నిలుపుకోలేని అసమర్థ ప్రభుత్వంగా రైతుల మనస్సుల్లో ముద్ర వేసుకుంటున్నది.

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): యాసంగి రైతుభరోసా పెట్టుబడి సాయంపై మిగిలిన రైతులు ఆశలు వదులుకోవాల్సిందేనా? ఈ సీజన్‌కు కూడా రేవంత్‌రెడ్డి సర్కారు ఎగనామం పెట్టినట్టేనా? అంటే ప్రభుత్వవర్గాలు అవుననే చెప్తున్నాయి. ఇప్పటికే యాసంగి సీజన్ ముగిసింది. మరో పది, పదిహేను రోజుల్లో వానకాలం ప్రారంభం కాబోతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో సర్కారు ఇంకా యాసంగి రైతు భరోసా బకాయిలను ఇస్తుందనుకోవడం ఉత్త భ్రమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం వచ్చే వానకాలం సీజన్‌కైనా పెట్టుబడిసాయం ఇస్తుందో లేదోననే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్ హయాంలో అడగకుండానే పెట్టుబడి సాయం అందేదని, ఇప్పుడు మొత్తుకున్నా ఇవ్వడం లేదని రైతులు చర్చించుకుంటున్నారు.

### భరోసా ఇవ్వని రేవంత్ గడువు!

రైతుభరోసా పథకాన్ని రేవంత్‌రెడ్డి సర్కారు రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న అట్టహాసంగా ప్రారంభించింది. అదేరోజు 577 పైలట్ గ్రామాల్లో కొంతమంది రైతులకు పెట్టుబడి సాయం జమ చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్చి 31వ తేదీ వరకు రైతులందరికీ రైతు భరోసా జమ చేస్తామని ప్రకటించారు. మార్చి 31 వెళ్లిపోయింది. ఏప్రిల్ పోయింది. మరో పది రోజులైతే మే 31 కూడా వస్తుంది. కానీ, ఇప్పటివరకు రైతులందరికీ రైతుభరోసా జమ కాలేదు. ఈ యాసంగి సీజన్‌లో ఏడు విడతల్లో మూడున్నర ఎకరాల వరకు మాత్రమే ప్రభుత్వం రైతుభరోసా నిధులు జమ చేసింది. యాసంగిలో మొత్తం 152 లక్షల ఎకరాలకు ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.9,120 కోట్లు రైతులకు పంపిణీ చేయాల్సి ఉన్నది. ఇప్పటివరకు సుమారు 85 లక్షల ఎకరాలకు రూ.5,100 కోట్లు మాత్రమే జమ చేసినట్టు తెలిసింది. ఇంకా రైతులకు రూ.4,020 కోట్లు పంపిణీ చేయాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ఇచ్చిన మాట ఏమైందీ? రైతుభరోసా ఏమైం దీ? అంటూ రైతులు ఆవేదనగా ప్రశ్నిస్తున్నారు. మాయమాటలతో రైతులను మోసం చేసుడేనా? రైతు భరోసా ఇచ్చేది ఉన్నదా? అని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'మీరంతా మమ్మల్ని క్షమించాలి. అనుకున్న సమయానికి రైతు భరోసా ఇవ్వలేకపోయాం. మిగిలినవారికి త్వరలోనే ఇస్తాం' అంటూ ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ వేదిక మీద చెప్పిన మాటలకు కూడా విలువ లేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### గత వానకాలం ఇయ్యలె.. ఈ వానకాలం ఇచ్చేనా?


రైతులెవరూ ఊహించి ఉండరు.. రాష్ట్రంలో రైతుబంధు ఆగిపోతుందని! కానీ, కాంగ్రెస్ సర్కారు మాత్రం రైతుల నమ్మకాన్ని వమ్ము చేసింది. గత వానకాలం రైతు భరోసాను నిలిపివేసింది. రైతుబంధును సంస్కరిస్తామంటూ కమిటీలు, అభిప్రాయ సేకరణ, అధ్యయనాలు అంటూ కాలయాపన చేసింది. వానకాలం పెట్టుబడి సాయానికి సున్నం చుట్టింది. దీంతో కేసీఆర్ హయాంలో అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నుంచి బయటపడ్డ రైతులు మళ్లీ ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దయనీయ స్థితిని చవిచూశారు. చివరకు ప్రస్తుత యాసంగి సీజన్ నుంచి ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పిన రేవంత్ సర్కారు ఆ మేరకైనా చిత్తశుద్ధిని ప్రదర్శించలేకపోయింది.

### రైతుభరోసా బకాయిలు రూ.21,800 కోట్లు

తాము అధికారంలోకి వస్తే ఎకరాకు సీజన్‌కు రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15వేలు రైతుభరోసా అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, అధికారంలోకి వచ్చాక రెండు సీజన్లలో రైతు భరోసాను అమలు చేయలేదు. మూడో సీజన్‌లో తగ్గించి అమలు చేసింది. నిజానికి, కాంగ్రెస్ ఎన్నికల హామీ ప్రకారం 2023–24 యాసంగిలో 152 లక్షల ఎకరాలకు రూ.7,500 చొప్పున రూ.11,400 కోట్లు చెల్లించాలి. కానీ, ఎకరాకు రూ.5వేల చొప్పున రూ.7,400 కోట్లు మాత్రమే చెల్లించింది. అంటే రూ.4వేల కోట్లు బకాయి పడింది. ఆ తర్వాత 2024–25 వానకాలంలో రైతులకు నయా పైసా ఇవ్వలేదు. అంటే రూ.11,400 కోట్లు బకాయి ఉన్నట్టే. ఇక ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటివరకు రూ.5వేల కోట్లు మాత్రమే చెల్లించింది. అంటే ఈ సీజన్‌లోనూ రూ.6,400 కోట్లు బకాయి పడింది. ఈ విధంగా మూడు సీజన్లకు కాంగ్రెస్ సర్కారు రైతులకు మొత్తంగా రూ.21,800 కోట్లు బకాయిపడింది. ఆ మేరకు రాష్ట్రంలో రైతుల ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది.

# 29కే తెలంగాణకు నైరుతి ఆగమనం

- 24న కేరళ.. 26న రాయలసీమ, 29న కోస్తాకు రుతుపవనాల రాక
- ద్రోణి ప్రభావంతో వచ్చే నాలుగు రోజులు వానలు: వాతావరణ కేంద్రం



హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు అనుకున్న దానికంటే అధిక వేగంతో కదులుతున్నాయని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇదే వేగం కొనసాగితే ఈనెల 24న కేరళను తాకే అవకాశాలున్నాయని పేర్కొన్నది. సాధారణం (జూన్1) కంటే ముందుగా 27నాటికి రుతుపవనాలు కేరళను పలకరిస్తాయని వాతావరణశాఖ అంచనా వేసిన విషయం తెలిసిందే. పరిస్థితులు అనుకూలంగా మారడంతో వాటి గమనం వేగంగా ఉన్నదని, 26న రాయలసీమ, 29న తెలంగాణ, కోస్తాంధ్రలోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవులను పూర్తిగా విస్తరించాయని తెలిపింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో వచ్చే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొన్నది. తూర్పు మధ్య అరేబియా సముద్రంలో కర్ణాటక తీరంలో బుధవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడనున్నదని, ఇది గురువారం నాటికి అల్పపీడనంగా మారి మరింత బలపడుతుందని అంచనా వేసినట్టు తెలిపింది. దీని ప్రభావంతో రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదిలే అవకాశాలున్నాయని వివరించింది. సోమవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్టు వెల్లడించింది. అత్యధికంగా నారాయణపేట జిల్లా మక్తల్‌లో 7.81 సెం.మీ, నర్వలో 6.30 సెం.మీ, మగ్నూర్‌లో 4.80 సెం.మీ, మరికల్‌లో 3.41 సెం.మీ, ధన్వాడలో 3.20 సెం.మీ, జోగులాంబ–గద్వాల జిల్లా రాజోలిలో 4.89 సెం.మీ, మనోపాడ్‌లో 4.48 సెం.మీ, వడ్డేపల్లిలో 3.31 సెం.మీ, కల్వూర్‌లో 3.24 సెం.మీ, రంగారెడ్డి జిల్లా నందిగామలో 3.20 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. అలాగే మంగళ, గురు, శుక్రవారాల్లో కూడా భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపింది. కాగా, సోమవారం 13జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, నిర్మల్ జిల్లా సారంగపూర్‌లో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ పేర్కొన్నది.

### అకాల వర్షం.. తీవ్ర నష్టం

ఇల్లెందు రూరల్/ కారేపల్లి/ చుంచుపల్లి/ ములకలపల్లి/చంద్రుగొండ, మే 19: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సోమవారం కురిసిన వర్షం తీవ్రనష్టాన్ని మిగిల్చింది. ఇల్లెందు మండలం కట్టుగూడెంలో పీ పుల్లయ్య (45) పొలంలో పనులు చేస్తున్న క్రమంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ భీకర శబ్దానికి.. పక్కనే ఉన్న అతడి సోదరుడు వెంకన్న సొమ్మసిల్లి పడిపోయాడు. కారేపల్లి మండలం పాటిమీదిగుంపు సమీపంలో పిడుగుపాటుకు 20 మూగజీవాలు మృత్యువాతపడగా లక్ష్మయ్య అనేవ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చంద్రుగొండ మండలం గానుగపాడులో విద్యుత్తు తీగ తెగి పడటంతో షాక్‌కొట్టి మూడు పశువులు మృత్యువాతపడ్డాయి. చుంచుపల్లి, ములకలపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. అయినప్పటికీ ధాన్యం తడిసింది.

### 77 మంది డీఎస్పీల బదిలీ



హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీగా డీఎస్పీలు బదిలీ అయ్యారు. మొత్తం 77 మందిని బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని తెలిపారు. బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులను డీజీపీ ఆదేశించారు.